# ఆచార్య మొదలి నాగభూషణశర్మగారి వ్యక్తిత్వం

- డి.యస్. దీక్షిత్

బహుముఖీన విషయాత్మక ప్రతిభతో సుహృద్భావనతో స్వచ్ఛంద హృదయ స్పందనతో అందరు కొనియాడుతున్న తమ వ్యక్తిత్వ వికాసంతో పరిపూర్ణులైన గురుదేవులు ఆచార్య మొదలి నాగభూషణశర్మగారి విశ్వవిరాడ్రూపాన్ని మనసునకెక్కించుకొని ఆ గురుదేవుల మార్గాన్ని అనుసరించి తత్ సాధనతో మాబోంట్ల మందరము కృతకృత్యులమగుదుముగాక అని భావన చేస్తున్నాను.

మాస్టారు 1935 జులై 24వ తేదీన వారి మేనమామగారైన భాగవతుల వెంకట సుబ్బారావుగారి ఇంట నరసరావుపేటలో జన్మించారు. మాస్టారు తల్లి శ్రీమతి కామేశ్వరమ్మ, తండ్రి మొదలి వెంకట సుబ్రహ్మణ్యంగారు.

ధూళిపూడిలో ఉన్న తటవర్తి బాపయ్య స్కూల్‌లో శర్మ మాస్టారిగారి తండ్రి వెంకట సుబ్రహ్మణ్యశర్మగారు ఆంగ్లోపాధ్యాయులు. ఆయన కృషి ఫలితంగానే ప్రైమరీ స్కూలు తటవర్తి బాపయ్య స్కూల్ హైస్కూల్‌గా మారింది. పదవీ విరమణ వరకు మాస్టారి తండ్రి వెంకట సుబ్రహణ్యశర్మగారు ఆ స్కూల్‌లోనే కొనసాగటము వలన వారి మొత్తము కుటుంబానికి ధూళిపూడి గ్రామమే స్వస్థలమయింది.

మాస్టారుకి తన ఏడవయేట ధూళిపూడిలో అక్షరాభ్యాసము జరిగింది. మాస్టారికి అక్షరాభ్యాసము చేసిన తొలి గురువు నేతి వెంకట రమణయ్య పంతులుగారు.

నాటినుండి వయోగతిని బట్టి విద్యను కొనసాగిస్తున్నారు శర్మ మాస్టారు. ఇంతవరకు ఇది అందరి విషయంలో సర్వసాధారణమే. 1984 నుంచి ఇప్పటివరకు ఈ 34 సంవత్సరాల పరిచయంలో సందర్భం కుదిరినప్పుడల్లా శర్మ మాస్టారి గురించి మేమంతా వింటున్న మాటొకటుంది. అదేమిటంటే "మా నాన్నగారి పూర్తి ప్రభావం నా మీద చాలా ఉంది" అని. కారణం తండ్రి వెంకట సుబ్రమణ్యశర్మగారు కేవలం ఆంగ్లోపాధ్యాయులే కాదు. విద్యార్థులందరికీ ఉపకరించే విధంగా ధూళిపూడి శర్మాస్ గైడ్ అనే గ్రంథాన్ని తయారుచేసిన మహానుభావుడు. ఆ గైడ్ ఎంత ఆదరణీయమైనదంటే ప్రతి వత్సరం పదివేల కాపీలు అందరికీ అందుబాటులోకి వెళ్ళేవి. అంతేకాదు ఆయన రచయిత కూడా. 18 కథలు, 3 నాటికలు, 20కిపై చిలుకు కవితలు ఇలా... ఇలా అందరినీ ఆలోచింపజేసే అనేక రచనలు చేసినవారు శర్మ మాస్టారి తండ్రిగారు.

కృష్ణా పత్రికలోనూ, ఆంధ్ర శేషగిరిరావుగారి ఆంధ్రభూమిలోనూ, వజ్జల కాళిదాసుగారి ఆనందవాణిలోనూ (మద్రాసు నుంచి వెలువడేది) శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రిగారి చంద్రికా, ప్రబుద్ధాంధ్ర పత్రికలలోనూ మాస్టారి తండ్రిగారి రచనలు వెలువడేవి.

ఇంతేకాకుండా మాస్టారి తండ్రిగారికి ప్రాచీన గ్రంథపఠన ప్రావీణ్యత పరిపుష్టంగా ఉండేది. కనుకనే మాస్టారు ఒక పక్క స్కూల్‌లో చదువుతున్నా, భారత భాగవత పద్యాలను, శతకాలలోని పద్యాలను సందర్భం కుదిరినప్పుడల్లా చదివిస్తూ అర్థం తెలియకపోతే అడిగి వివరంగా చెబుతూ ఆ చిన్నవయసులోనే తెలుగు

సాహిత్యాభిమానాన్ని పెంపొందించినవారు మాస్టారి తండ్రిగారు. పిల్లలందరికోసమూ మాస్టారి తండ్రిగారు పాఠశాలలో ఆంధ్రోత్సవాలు నిర్వహించేవారు. సాధారణ విద్యతో పాటు అనుబంధ విద్యలన్నీ తెలుసుకొని ఎదగాలి మీరు అంటూ – విశ్వనాథ సత్యనారాయణ, నోరి నరసింహశాస్త్రి, మొక్కపాటి నరసింహశాస్త్రి, చింతా దీక్షితులు వంటి మహానుభావుల్ని ఆహ్వానించి పిల్లలముందుంచి వారితో మాట్లాడించి ప్రోత్సాహకంగా స్కూలు పిల్లల మధ్య పోటీలు, నాటికలు, పిల్లల్లో పద్యం పట్ల మక్కువ కలగాలన్న సంకల్పంతో చావలి జగన్నాథరావుగారి ద్వారా లఘునాటికలుగా, పద్యనాటికలు వేయించటం వంటి ఎన్నో ఎన్నో కార్యక్రమాలు నిర్వహించేవారు మాస్టారి తండ్రిగారు. స్కూల్లో చదువుతున్న వయసులోనే ఇంటివిద్యగా ఇన్నిన్ని కార్యక్రమాలు ఇంత విస్తృతంగా జరుగుతున్నాయంటే వీటన్నిటికీ కారకులు వెంకట సుబ్రహ్మణ్యశర్మగారే కదా. కనుకనే ఆయన అంటారు "నాపై మా నాన్నగారి ముద్రే ఎక్కువగా ఉందని". మాస్టారు హైస్కూల్‌లో తన పదో తరగతి పూర్తికాకముందే పుస్తకాలపై ఉన్న మక్కువతో మూడు వేల పుస్తకాలను చదివారు.

శరత్‌బాబుగారి బెంగాలీ కథను వేలూరి శివరామశాస్త్రిగారు తెలుగులో అనువదించిన లఘునాటిక "రాముని బుద్ధిమంతతనం". ఈ నాటికలో మాస్టారు తొలిగా రాముని పాత్ర ధరించటం జరిగింది. మాస్టారి తమ్ముడు బాలేందుమౌళిశర్మ పినతల్లి పాత్రను ధరించారు.

ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం విజయవాడ ఎస్‌ఆర్‌ఆర్ & సివిఆర్ కళాశాలలో చదివారు. ఇక్కడ విశ్వనాథవారు జటావల్లభుల పురుషోత్తమశాస్త్రి, పాటిబండ్ల మాధవశర్మ, పొట్లపల్లి సీతారామారావు వంటి ఉద్దండుల వద్ద విద్యనభ్యసించే అదృష్టం పొందారు శర్మగారు. ఆ సంవత్సరంలోనే గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్యగారి కుమారుడు తాండవకృష్ణ రచన 'సుజాత' అనే నాటిక, అందులో శర్మ మాస్టారు బుద్ధపాత్ర ధరించారు.

రేడియో మాధ్యమం ద్వారా బాలభారతిగా పేరొందిన ఏడిద కామేశ్వరరావుగారు అందరికీ సుపరిచితులే. ఒకే సంవత్సరంలో కామేశ్వరరావుగారి నేతృత్వంలో 40 రేడియో నాటికలు శర్మ మాస్టారు చేయడం విశేషం.

ఏడిద కామేశ్వరరావుగారు విజయవాడలో భారీస్థాయిలో బాలల దినోత్సవం నిర్వహించారు. ఆ ఉత్సవాలకి న్యాయపతి రాఘవరావుగారు – అక్కయ్యగారు వచ్చి పాల్గొన్నారు. ఆ బాలల దినోత్సవ నిర్వాహక విభాగంలో ట్రెజరర్‌గా ఉండి సమర్థవంతంగా ఉత్సవాలు నిర్వహించినవారు మరెవరో కాదు మన మాస్టారే. ముఖ్యమైన విషయం ఈ బాలల దినోత్సవానికి జవహర్‌లాల్ నెహ్రూగారు వచ్చి అందరినీ ఆశీర్వదించటం.

బందరులో ఇంటర్మీడియట్ రెండవ సంవత్సరం చదువుతున్నపుడు మునిమాణిక్యం రచించిన "గృహప్రవేశం" నాటికకు దర్శకత్వం వహించి, కథానాయకుని పాత్ర వేసారు మాస్టారు. బందరులో ప్రఖ్యాతులైన డా॥ కుప్పా వెంకటరామశాస్త్రి, విన్నకోట మాధవరావు – వీరిద్దరి ప్రోద్బలంతోనే మాస్టారు "కన్యాశుల్కం" నాటక ప్రదర్శనకు శ్రీకారం చుట్టారు. మధురవాణి పాత్ర మాస్టారుది. బందరు బుట్టాయిపేట థియేటర్‌లో ప్రదర్శించిన కన్యాశుల్కం సన్నివేశాలన్నీ రక్తికట్టడంతో అనేకసార్లు ఆ ప్రదర్శనలలో మాస్టారే మధురవాణి పాత్రను ధరించారు.

గుడివాడలో డిగ్రీ చదువుతున్నపుడు "అన్వేషణ" తో నాటకరచనకు శ్రీకారం చుట్టారు. తరువాత పిల్లలు పెద్దలు, విషాదాంతం ఇవన్నీ ప్రదర్శితమైన నాటికలు. కావ్యశ్రీ రచించిన 'మానవుడు' నాటికను మాస్టారు

దర్శకత్వంలో ప్రదర్శించారు. గుడివాడలో డిగ్రీ పూర్తికాగానే గుంటూరు ఏ.సి. కాలేజికి స్పెషల్ ట్యూటర్‌గా వెళ్ళారు.

గుంటూరు ఏ.సి.కాలేజిలో మాస్టారు రచన, దర్శకత్వంలో అడ్డదారి, రాజదండం ప్రదర్శనలు చేశారు. డి.వి.నరసరాజుగారి "నాటకం" అనే నాటకాన్ని కూడా మాస్టారి దర్శకత్వంలో ప్రదర్శించారు. ఇందులో ప్రధానపాత్ర వేసింది తరువాత అందాలనటుడిగా ప్రఖ్యాతమైన శోభన్‌బాబుగారు. అదీ శర్మ మాస్టారు దర్శకత్వంలోనే.

ఆ తరువాత శర్మ మాస్టరుగారు ఎం.ఏ. ఇంగ్లీషు చదివేందుకై హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో చేరారు. అధ్యయన సమయంలో "విషాదాంతం" ప్రదర్శన చేసి ఆంధ్రనాటక కళాపరిషత్ పోటీలకు తీసుకెళ్లారు.

1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఆంగ్లోపాధ్యాయునిగా పదవీబాధ్యతలు స్వీకరించటం, 1961లో వరంగల్‌కు బదిలీ కావడం, మళ్ళీ 1967లో హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయానికి రావడం, ఆ సమయంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం ద్వారా "ఆంధ్రాభ్యుదయోత్సవాలు" జరగడం. ఆ ఉత్సవాల్లో ప్రత్యేకంగా నాటక విభాగాన్ని మాస్టారు, నారాయణరెడ్డిగార్లు ప్రధానులై ఉండి విజయవంతంగా ఉత్సవాలు నిర్వహించారు.

1972లో అభినయ విద్యాభ్యాసం కొరకు మాస్టారు అమెరికాలోని ఇల్లినాయిస్‌కు వెళ్ళారు. అక్కడ యూనివర్సిటీ ఆఫ్ వెస్టర్న్ ఇల్లినాయిస్‌లో చేరి దర్శకత్వవిద్యార్థిగా మూడు నాటకప్రదర్శనలకు దర్శకత్వం వహించారు.

యూనివర్సిటీ కేంపసులో వేయటమే కాకుండా Sacrifice ప్రదర్శనను చికాగోలో వేసేందుకు వెళ్ళడం. అక్కడ ఉస్మానియా విశ్వవిద్యాలయములోని మాస్టారుగారి సహాధ్యాయు ప్రొ॥జి. రామిరెడ్డిగారు కలవడం వారిని మాస్టారు ప్రదర్శనలకు ఆహ్వానించడం ఆయన వచ్చి మాస్టారు దర్శకత్వం వహించిన "Sacrifice" నాటక ప్రదర్శన చూచి ప్రొఫెసర్ జి.రామిరెడ్డి సంభ్రమాశ్చర్యాలకు గురికావడం, తత్ఫలితంగా తిరిగి వచ్చి ఉస్మానియా యూనివర్సిటీలో 1983 సంవత్సరములో మాస్టారు నేతృత్వంలో "Department of Theatre Arts" ను స్థాపించి కొనసాగించటం జరిగింది.

ఆ మీదట 1988 చివరలో హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంకి వచ్చి "థియేటర్ ఆర్ట్స్" విభాగంలో పదవీ బాధ్యతలు స్వీకరించారు శర్మమాస్టారు. 1989-90 సంవత్సరాలలో మాస్టారి స్వీయరచనా దర్శకత్వంలో చేసిన నాటకాలు, Students Productionsగా, ఆయన నేతృత్వంలో చేయించిన నాటకాలు ఎన్నో ఉన్నాయి.

తిరిగి ఉస్మానియా యూనివర్సిటీ థియేటర్ ఆర్ట్స్ విభాగానికి వచ్చి, ఎన్నో రచనలు, ఎన్నో ప్రదర్శనలను దర్శకత్వాలు చేసీ, చేసీ గురుదేవులు మొదలి నాగభూషణశర్మగారు 1995 జులై 31న పదవీ విరమణ చేశారు.

కానీ పదవీ విరమణకు ముందే మాస్టారు 1992లోనే వృత్తి నాటక విధానం, టిక్కెట్టుకొని నాటకం చూడాలి ప్రేక్షకులు అంటూ అనేకమందితో అనేక సమావేశాల ద్వారా తన ఆలోచనలను తెలియజేస్తూ, అందరి అభిప్రాయ సేకరణ చేసి సమగ్రమైన యోచనతో హెచ్.జె.దొరగారు, డా.కె.వి.రమణాచారిగారు లాంటి పెద్దలందరి సమక్షంలో 1993 మార్చి 9వతేదీన "రసరంజని" సంస్థను ఆరంభించారు.

9,10,11 తేదీలలో 3రోజులపాటు కన్యాశుల్కం నాటక ప్రదర్శనలతో ఈ రసరంజని శుభారంభాన్ని కొనసాగించారు. కొనసాగిస్తున్నారు. కొనసాగిస్తూనే ఉంటారు.

జవహర్ బాలభవన్ డైరెక్టరుగా ఉన్న బుడ్డిగ సుబ్బరాయన్‌గారి ఆధ్వర్యంలో – Puppet Theatre వర్క్‌షాప్‌ని నిర్వహించడం..., ఆ సందర్భంగా భారతదేశంలో పప్పెట్ థియేటర్‌లో ప్రఖ్యాతులయిన సురేష్‌దత్తాగారిని కలకత్తా నుండి పిలిపించి, ప్రదర్శనలు వేయించి, అత్యంత వైభవముగా "APPA" Festival హైదరాబాద్‌లో నిర్వహించారు.

అంతకుముందే మాస్టారు భాగవతుల రామకోటయ్యగారి వద్ద యక్షగాన ప్రదర్శనా విధానాల్లో శిక్షణ పొంది ప్రేక్షక సమక్షంలో ప్రదర్శన ఇవ్వగల స్థాయికి చేరుకున్నారు.

అలానే మాధవపట్నం వెళ్ళి అక్కడ వనపర్తి బాలాజీ వద్ద తోలుబొమ్మలాటల ప్రదర్శనా రీతుల్లో శిక్షణ పొందారు. అక్కడ ఉన్నవారికి మాస్టారు ఇంగ్లీషు నేర్పారు. వారి నుండి తోలుబొమ్మలాట నేర్చుకున్నారు.

ఈ జానపద కళలన్నిటినీ దేశ విదేశాలలో స్వయంగా మాస్టారే దగ్గరుండి ప్రదర్శనలిప్పిస్తూ తిరిగారు.

"అజో – విభొ – కందాళం ఫౌండేషన్" వారు శర్మ మాస్టారుకి "ప్రతిభామూర్తి" పురస్కారాన్ని అందిస్తున్న శుభసందర్భాన శర్మమాస్టారిని అక్షరాకృతిలో ఈమాత్రము భావన చేసే అవకాశం కలగడం నా మహద్భాగ్యంగా భావిస్తూ, ఆచార్య మొదలి నాగభూషణశర్మ గురుదేవులకు ఇవే నా సువిధేయ సుమనస్సునమస్సులు.

**అనుబంధం :**

## న్యాసాంశం – 1

### ఆచార్య మొదలి నాగభూషణశర్మ గురువర్యుల తల్లిదండ్రులు – కుటుంబ సభ్యులు

తల్లి : శ్రీమతి కామేశ్వరమ్మ, తండ్రి : శ్రీ మొదలి వెంకటసుబ్రహ్మణ్యశర్మ, ప్రథమ సంతానం :శ్రీమతి ఉమాదేవి, రెండవ సంతానం : మొదలి నాగభూషణశర్మ, మూడవ సంతానం : బాలేందుమౌళిశర్మ, నాల్గవ సంతానం : శ్రీమతి అన్నపూర్ణ, ఐదవ సంతానం : దాక్షాయణి.

## న్యాసాంశం – 2

### శ్రీమతి సరస్వతీ – శ్రీ మొదలి నాగభూషణశర్మగారి కుటుంబ సభ్యులు

| | | |
|---|---|---|
| ప్రథమ సంతానం | : | శరత్ మొదలి – శ్రీమతి లక్ష్మీరాధిక (భార్య) |
| | | మనవళ్ళు : ప్రణవ్ – కాశ్యప్ |
| ద్వితీయ సంతానం | : | ఆనంద్ మొదలి – శ్రీమతి శ్రీకళ (భార్య) |
| | | మనవళ్ళు : కార్తిక్ – అఖిల్ |

## న్యాసాంశం – 3

### శర్మ మాస్టారు విద్య పూర్తయేంతవరకు చదివిన ప్రదేశాలు

ప్రాథమిక విద్య నుంచి హైస్కూల్ వరకు : తటవర్తి బాపయ్య హైస్కూల్, ధూళిపూడి.

ఇంటర్ మొదటి సంవత్సరం : ఎస్ఆర్ఆర్ & సివిఆర్ కళాశాల, విజయవాడ.

| | | |
|---|---|---|
| ఇంటర్ రెండవ సంవత్సరం | : | బందరు హిందూ కాలేజి, బందరు |
| బి.ఎ. | : | గుడివాడ కళాశాల, గుడివాడ. |
| ఇంగ్లీషు ఎం.ఏ. | : | ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్ |
| M.F.A. | : | University of Western Illinois, America |

## న్యాసాంశం - 4
## శర్మ మాస్టారుగారు చిన్ననాటనుండి ప్రదర్శించిన నాటకాలు

**ధూళిపూడి తటవర్తి బాపయ్య హైస్కూల్**

1) రాముని బుద్ధిమంతతనం (రాముని పాత్ర), 2) విధి నిర్వహణం

3) అసంపూర్ణ రామాయణం, 4) సత్యాగ్రహం (గాంధీ మీద)

**విజయవాడ ఎస్ఆర్ఆర్ & సివిఆర్ కాలేజి (ప్రథమ సంవత్సరం ఇంటర్)**

5) నాటకం, 6) మానవుడు, 7) సుజాత, 8) యాభైవరకు రేడియో నాటికలు

**బందరు హిందూ కాలేజి (ఇంటర్ రెండవ సంవత్సరం)**

9) భంగపాటు, 10) పాలేరు, 11) గృహప్రవేశం (మునిమాణిక్యం రచన), 12) కన్యాశుల్కం

**గుడివాడ కాలేజి (బి.ఎ.)**

13) మొదటి రచన అన్వేషణ (భారత్ 1954 ఏప్రిల్ నెలలో ప్రచురితం)

14) పిల్లలు పెద్దలు, 15) విషాదాంతం, 16) మానవుడు (కావ్యశ్రీ రచన) దర్శకత్వం : మాస్టారు

**గుంటూరు ఏ.సి. కాలేజిలో 1 సం॥ స్పెషల్ ట్యూటర్‌గా**

17) అడ్డదారి (రచన, దర్శకత్వం) ఆంధ్రప్రభ వీక్లీలో ప్రచురితం, 18) రాజదండం (భారతిలో ప్రచురితం)

19) నాటకం (డి.వి. నరసరాజు) దర్శకత్వం : మాస్టారు
సినీనటులు శోభన్‌బాబు, కోకా సంజీవరావు తొలిసారిగా రంగప్రవేశం

**హైదరాబాద్ ఉస్మానియా విశ్వవిద్యాలయం ఎం.ఎ. ఇంగ్లీషు (రెండవ సంవత్సరం)**

20) విషాదాంతం (ఆంధ్రనాటక కళాపరిత్ పోటీలకు తీసుకెళ్ళారు, ఆంధ్రా యూనివర్సిటీలో ప్రదర్శింపబడినది)

1951లో అఖిలాంధ్ర బాలల మహాసభలో మాస్టారుగారు ట్రెజరర్ & పర్‌ఫార్మర్. అప్పుడు ప్రదర్శించిన రేడియో నాటిక-మరమనిషి, 1960లో ఉస్మానియా విశ్వవిద్యాలయములో ఆంగ్లోపాధ్యాయునిగా ప్రవేశం, 1961లో వరంగల్‌కు ట్రాన్స్‌ఫర్

1961 నుండి 67 వరంగల్ ఆర్ట్స్ & సైన్స్ కాలేజి, 1963లో కాకతీయ ఉత్సవాలలో నాటకాలు ప్రారంభం (ఐదు రోజులు జరిగేవి), 1965లో, 21)జననీ జన్మభూమి (రచన, దర్శకత్వం), 1964లో 22) సంస్కర్తలు (రచన, దర్శకత్వం), ఆంధ్రపత్రిక ఉగాది సంచికలో.

1967లో ఉస్మానియా విశ్వవిద్యాలయానికి ట్రాన్స్ఫర్ డా॥ సి.నా.రె. డా॥ మొదలి నాగభూషణశర్మగార్లు నాటక విభాగానికి ప్రాతినిధ్యం వహించగా ఆంధ్రాభ్యుదయోత్సవాలు 1970 వరకు జరిగాయి.

1972లో అమెరికా ప్రయాణం (ఇల్లినాయిస్). అక్కడ దర్శకత్వంలో భాగంగా దర్శకత్వ విద్యార్థిగా 3 నాటకాలు ప్రదర్శితం.

University of Western Illinois

23) Sacrifice రవీంద్రనాథ్ ఠాగూర్ మొదటి ప్రదర్శన

24) Picnic on the battle field (Arrabal) ఇల్లినాయిస్ కేంపస్

25) The mad women of shaichio గిరదో ఫ్రెంచి రైటర్

1974లో స్వదేశానికి ఆగమనం ఉస్మానియాలో కొనసాగటం. యూనివర్సిటీ క్లబ్‌లో 4 సంవత్సరాలు ప్రత్యేకంగా ఇంగ్లీషు నాటకాలు.

26) The Wedding Anniversary (S.K. Kumar)

27) హయవదన (గిరీష్ కర్నాడ్)

28) రాజా ఈడిపస్ (ఓ.యు. క్లబ్)

1978 నుంచి 1982 వరకు డిసిహెచ్ డ్రమటిక్ సర్కిల్, హైదరాబాద్‌లో నాలుగు నాటకాలు

29) హయవదన, 30) తుగ్లక్ (గిరీష్ కర్నాడ్), 31) The Visit (ఫ్రెడరిక్ డ్యూరెన్ మా), 32)మృచ్ఛకటిక

**1982లో ఉస్మానియా యూనివర్సిటీ - థియేటర్ ఆర్ట్ డిపార్ట్‌మెంట్**

ఉస్మానియా విశ్వవిద్యాలయం థియేటర్ఆర్ట్స్ విభాగంలో మాస్టారు రచించి దర్శకత్వం వహించిన నాటక ప్రదర్శనలు, ఇతరరచనలకు దర్శకత్వం వహించిన నాటక ప్రదర్శనలు, అనువదించి చేసిన నాటక ప్రదర్శనలు: 33) రాజా ఈడిపస్, 34) విశ్వశాంతి, 35) పిసినిగొట్టు (మైజర్), 36) ప్రజల మనిషి - (ఎనిమి ఆఫ్ ది పీపుల్), 37) నిశ్శబ్దం కోర్టు నడుస్తుంది (శాంత్‌తా కోర్ట్ ఛాతాహై), 38) దేవుడైవస్తాడంట (వెయిటింగ్ ఫర్ గోడో), 39) దొరా ! నీ సావు మూడింది (టైటిల్ మార్చి పై నాటకాన్ని), 40) నరజాతి చరిత్ర పేరుతో 100 ప్రదర్శనలు వేయటం జరిగింది, 41) భగవదజ్జుకం

**1988 చివరలో హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో పదవీ బాధ్యతలు స్వీకరించినప్పటినుంచి 1990 వరకు చేసిన ప్రదర్శనలు. శర్మ మాస్టారు చేసిన నాటకాలు, స్టూడెంట్స్ ప్రొడక్షన్స్‌గా చేయించిన నాటకాలు.**


42. కాయితం పులి (పోస్టర్), 43. వెయిటింగ్ ఫర్ గోడో, 44. దంత వేదాంతం, 45. గ్లాస్ మేనేజర్, 46. పోర్ట్రైట్, 47. మేక్ బెత్.

### శర్మ మాస్టారు రసరసంజని ద్వారా ప్రదర్శించిన నాటకాలు

48. ముద్రారాక్షసం, 49. కాయితం పులి, 50. నాలుగిళ్ళ చావిడి, 51. సాంబశివ ప్రహసనం, 52. ప్రజానాయకుడు ప్రకాశం (34 ప్రదర్శనలు, ఈ నాటకాన్ని ఎన్ఎస్‌బి - భారత్ మహోత్సవ్ - ఢిల్లీ ఫెస్టివల్‌లో ప్రదర్శించారు.) 53. హయవదన, 54. మదనకామరాజు కథ, 55. మన్మధుడు మళ్ళీ పుట్టాడు, 56. ప్రతాపరుద్రీయమ్, 57. 2017 మార్చి 26న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అంధయుగం నాటికాన్ని ప్రదర్శించారు.

### శర్మ మాస్టారు అందుకొన్న కొన్ని పురస్కారాలు :

- కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కారం - "ఠాగూర్స్ అకాడమీ రత్న"
  Prestigious : Theatre Academy Fellowship
- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారం (ఎన్‌టిఆర్ అవార్డు)
- పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా ప్రజానాయకుడు ప్రకాశం అనే నాటక రచన, దర్శకత్వానికి, నాటక శిల్పం అనే రచనకి ప్రతిభామూర్తి పురస్కారం.
- విజయనగరం సాహితీ సమాఖ్య ద్వారా గురజాడ పురస్కారం.
- అనంతపురం లలిత కళాసమితి ద్వారా బళ్ళారి రాఘవ పురస్కారం
- హైదరాబాద్ అభినందన సంస్థ ద్వారా ఆచార్య ఆత్రేయ పురస్కారం
- రావులపాలెం సర్. ఆర్థర్ కాటన్ కల్చరల్ క్లబ్‌వారి ద్వారా (సర్ ఆర్థర్ కాటన్ పురస్కారం)
- బళ్ళారి ధర్మవరం రామకృష్ణమాచార్యులవారి "రంగసిరి" పురస్కారం
- విశ్వనాథ సాహిత్యఅకాడమి, గుంటూరువారి 'విద్యాసుందరి' బెంగుళూరు నాగరత్నమ్మ స్మారక పురస్కారం
- తెనాలివారి రంగస్థల కళాకారుల సంఘం ద్వారా "ప్రతిష్ఠాత్మక రంగస్థల పురస్కారం"



ముద్రారాక్షసం నాటకానికి సూత్రధారుడు, నటిగా మొదలి దంపతులు